ఈ-పేపర్ తెలుగు డైలీ 8PM

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

సోమవారం, జూన్ 1, 2026

# రోడ్డు నడిమట్లనే సిమెంట్ కచ్రా.. పట్టించుకోని జీహెచ్‌సీ సార్లు ..!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 1:** అంబర్‌పేట డివిజన్ ప్రేమ్ నగర్ గల్లీల జీహెచ్‌సీ ఆఫీసర్ల నిర్లక్ష్యం కాస్త ముదిరిపోయింది. పైసలు పెట్టి పనులు చేస్తున్నారు సరే.. కానీ పర్యవేక్షణ సుతారం లేకపోవడంతో జనాలు ఆగమాగమైతాంర్రు.రెండ్రోజుల కింద ఇక్కడ సీసీ రోడ్డు పనుల కోసం రోడ్డంత తవ్వి పడ్డారు. ఆ తవ్విన సిమెంట్, మట్టి వ్యర్థాలను (కచ్రాను) కాంట్రాక్టరు గాడు అట్లనే రోడ్డు నడిమట్లనే పోసి వదిలేసిండు. నిజానికి పనవగ్గానే ఆ కచ్రాను లారీలేసి తరలించాలె, కానీ ఆ కాంట్రాక్టర్ దాన్ని పైలం చేసేశాడు మరిచిపోయిండు. దాంతో అటుకెళ్లి నడిచేటోళ్లకు, బండ్లు నడిపేటోళ్లకు చుక్కలు కనిపిస్తాంర్రు."రోడ్డు మధ్యలోనే ఇంత పెద్ద దిబ్బ పెడితే ఎట్లా పోవాలె?" అని స్థానికులు, బండ్లాయనలు జీహెచ్‌సీ అధికారులకు మొత్తుకున్నా కూడా ఒక్కడంటే ఒక్కడు పట్టించుకుంటలేడు. ఇగ రాత్రి పూటల చీకట్లో ఈ మట్టి గుట్టలు తెల్వక బైకుల మీద పోయేటోళ్లు కిందపడి దెబ్బలు తాకించుకుంటాంర్రు.

**ఇంకో ముచ్చటేందంటే..**

అలీ కేఫ్ చౌరస్తా నుంచి ఆజాద్ నగర్ పోయే రోడ్ల నూతన సీసీ రోడ్


ప్రేమ్ నగర్‌లో రోడ్డు మధ్యలో సిమెంటు వ్యర్థాలు...

పనులు నత్తనడకన నడుస్తాంర్రు. పనులల్ల లేటు కావడం వల్ల అటు పక్కన ఉన్న దుస్తులు వాళ్లు, వ్యాపారస్తులు బోణీలు కాక తెగ ఇబ్బంది పడుతాంర్రు. కాంట్రాక్టర్ తన ఇష్టమొచ్చినట్లుగా కాలయాపన చేస్తున్నాడని కాలనీ జనాలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌సీ పెద్ద సార్లు కొంచెం ఇటు దిక్కు చూసి, ఆ కాంట్రాక్టర్‌ని గట్టిగా అడిగారు.. రోడ్డు మధ్యలో ఉన్న సిమెంట్ వ్యర్థాలను వెంటనే బరాబర్ తీపియ్యాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.


రూ. వెయ్యి కోట్ల నిధులపై సీఎం ఫోకస్.. అధికారులకు సీరియస్ వార్నింగ్.! 2


నీట్ రీ-టెస్ట్‌పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు.. సీబీటీ పిటిషన్ తిరస్కరణ 2


బ్యాంక్ ముందే వంటలు.. అక్కడే భోజనాలు.. అసలు మ్యాటరేంటంటే? 3


కడుపుతో ఉన్న భార్య కోసం ఖాకీలతోని కొట్లాట.. నడిరోడ్డుపై కూర్చున్న సామాన్యుడు! .. 3

## పాన్ డబ్బా కొడుకు నుండి

# ప్రొఫెసర్ దాకా..!

- నాడు లాఠీలకు ఎదురొడ్డిన స్టూడెంట్ లీడర్....
- ఒళ్లు హూనమైనా..వెనకడుగు వేయలె..
- ఇనుప కటకటాల చూసి ఇసుమంతైనా భయపడలె..!
- ఉస్మానియా ఉడుకు రక్తం.. గ్రూప్-1 పరీక్షలనే అడ్డగించిన తెలంగాణ తెగువ..
- "మధ్యతరగతి ఇల్లు.. కష్టాలకెదురీగి డాక్టరేట్ వరకు చదువుల తల్వార్..!"
- "పోరగాని వయసులోనే పోరాట బుద్ధి.. ఊరూరా తిరిగి జనాన్ని చైతన్యం చేసిన ఊపు!"
- ఇదీ అంబర్ పేట ముద్దుబిడ్డ డాక్టర్ కొండేరు రాకేష్ వంజరి ఉద్యమ ప్రస్థానం
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'ఇయ్యాల్టి 'స్పెషల్ స్టోరీ ..

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 1:**

తెలంగాణ ఉద్యమమంటేనే ఉస్మానియా ఉడుకు రక్తం..! పోలీసుల లాఠీలు విరిగినా వెనకడుగు వెయ్యని గుండె ధైర్యం..! నాడు ఆంధ్రా పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ.. గ్రూప్–1 పరీక్షలనే అడ్డగించిన తెగువ ఆయన సొంతం. పాన్ డబ్బా నడుపుకునే ఓ సామాన్య మధ్యతరగతి ఇంట్లకెళ్లి.. కష్టాల సుడిగుండాల్ని దాటుకుంటూ వెళ్లాడు' ముద్దుబిడ్డ మన రాకేష్ అన్న.. పోరగాని వయసులోనే జెండా పట్టి.. ఊరూరా తిరిగి జనాన్ని చైతన్యం చేసిన ఆ ఉద్యమ కెరటం.. పాన్ డబ్బా కొడుకు నుంచి ప్రొఫెసర్ దాకా ఎదిగిన తీరు నిజంగా ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం..అంబర్ పేట తురాబ్ నగర్ కు చెందిన కొండేరు రాములు, వనిత దంపతుల కుమారుడు డాక్టర్ కొండేరు రాకేష్ వంజరి ఉద్యమ ప్రస్థానంపై తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'ఇయ్యాల్టి' స్పెషల్ స్టోరీ..

### మధ్యతరగతి ఇల్లు.. పాన్ డబ్బానే ఆధారం!

రాకేష్ పెద్ద గద్దెలున్న కుటుంబం నుంచే రాలేదు. పైసలున్న ఇల్లెం కాదు. అచ్చమైన మధ్యతరగతి ఇల్లు. తండ్రి రాములు ఒక చిన్న పాన్ షాప్ నడుపుకుంటూ, ఆ డబ్బా మీద వచ్చే నయాపైసలతోనే ఇల్లు వెళ్లదీస్తూ రాకేష్‌ను చదివించాడు. ఇంట్లో ఎన్ని తిప్పలున్నా, తండ్రి కష్టాన్ని కండ్లజూసిన రాకేష్, చదువుల టాప్ ఉండడమే కాదు.. సమాజం కోసం కూడా ఆలోచించడం మొదలుపెట్టాడు. చిన్నప్పటి నుంచే నలుగురిని కూడగట్టే తత్వం, అన్యాయం ఎక్కడున్నా ఎదురుతిరిగే గుణం ఆయనల గూడుకట్టుకున్నాయి.

### ఉస్మానియా ఉడుకు రక్తం.. ఏబీవీపీ తోని ముందడుగు!

తెలంగాణ మలిదశ ఉద్యమం (2009–2014) ఉధృత రూపం దాల్చుతున్న టైంలో రాకేష్ కాలేజీల అడుగుపెట్టిండు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విద్యార్థి సంఘం ద్వారా లీడర్‌గా ఎదిగాడు. దేశ సమగ్రత, విద్యార్థుల హక్కుల కోసం క్యాంపస్ వేదికగా నిరంతరం సాగే రాజీలేని పోరాటం, వ్యవస్థలో లోపాలను ఎండగట్టడంలో, అన్యాయాన్ని ఎదిరించడంలో లాఠీలకు, జైలు గోడలకు వెరవని విద్యార్థి తెగువను నేర్పిన విద్యార్థి పరిషత్ స్ఫూర్తితో...


యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాకేష్

గప్పుడే తెలంగాణ కాంక్ష ఆయన రక్తాన్ని ఉడికించింది. "మన నీళు,, మన నిధులు, మన నియామకాలు మనకే కావాలె" అని గర్జించిండు. ఒకపక్క చదువుకుంటూనే, ఇంకొకపక్క వందలాది మంది విద్యార్థులను ఏకం చేసిండు. జనంల చైతన్యం తెచ్చేందుకు ఊరూరా తిరిగి అవగాహన సదస్సులు పెట్టిండు.

### ఆ గ్రూప్-1 పరీక్షల అడ్డగింత.. పోలీస్ లాఠీలకు వెరవని ధీరుడు!

రాకేష్ పేరు వింటే తెలంగాణ ఉద్యమ చరిత్రల గిట్టినప్పటికీ గుర్తొచ్చే పెద్ద ముచ్చట.. రామంతాపూర్ మేఘా కాలేజీలో జరిగిన సంఘటన. అప్పట్లో ఆంధ్రా పాలకుల నోటిఫికేషన్లకు వ్యతిరేకంగా, "తెలంగాణ వచ్చినాకనే ఉద్యోగాల భర్తీ జరగాలి" అని డిమాండ్ చేస్తూ గ్రూప్ పరీక్షలను అడ్డుకునేందుకు రాకేష్ తన అనుచరులతో దూసుకెళ్లిండు. గప్పుడు పోలీసులు చేసిన లాఠీచార్జ్ సామాన్యమైనది కాదు. ఒళ్లు హూనమైనా, రక్తం ఓడినా రాకేష్ వెనక్కి తగ్గలేదు. "నా తెలంగాణ.. నా రక్తం" అని నినదించిండు.

గదే కాదు.."ఫ్రీజోన్ కాదురా.. హైదరాబాద్ మాదిరా" అంటూ గల్లీ గల్లీల కొట్లాడిండు.ఛలో అసెంబ్లీ, ఛలో సచివాలయం, మహా విద్యార్థి పాదయాత్రల ముందు నిలబడి నడిపించిండు.

### రామంతాపూర్ ఉద్యమ కేంద్రంగా..
### ఆంక్షల నడుమ సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగురవేసి...

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీకి కూతవేటు దూరంలో ఉన్న రామంతాపూర్ ప్రాంతాన్ని కోటగా మార్చడంలో నాటి ఏబీవీపీ రామంతాపూర్ ఇంచార్జి, నేటి ప్రొఫెసర్ డాక్టర్ కొండేరు రాకేష్ వంజరి కీలక పాత్ర పోషించారు. ఉస్మానియా ఉడుకు రక్తాన్ని రామంతాపూర్ వీధుల్లోకి నడిపిస్తూ.. విద్యార్థి లోకాన్ని స్వరాష్ట్ర సాధన వైపు చైతన్యపరిచారు. నాడు ఆంధ్రా పాలకుల, సమైక్య వాద నాయకుల ప్రభావంలో ఉన్న రామమంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడుగుపెట్టడమే ఒక సవాల్. అలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ రాకేష్ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులను సమీకరించి, అనేక ర్యాలీలు, నిరసనలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. సమైక్య పాలకుల గుండెల్లో నిద్రపోతూ ప్రత్యేక తెలంగాణ భావజాలాన్ని విద్యాసంస్థల్లో బలంగా నాటారు.ఉద్యమ కాలంలో తీవ్ర ఉద్రిక్తతలు, ఆంక్షల నడుమ సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగురవేయడానికి చాలామంది వెనుకాడిన తరుణంలో రాకేష్ వంజరి తన తెగువను చాటుకున్నారు. ప్రభుత్వ హోమియోపతి కళాశాల సాక్షిగా ప్రాణాలకు తెగించి, ధైర్యంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ చరిత్రాత్మక సంఘటన నాడు దేశభక్తికి, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది.

### ఇనుప కటకటాల చూసి ఇసుమంతైనా భయపడలె..!"

ఈ పోరాటాలన్నీ ఎన్నో కేసులు, ఎన్నో అరెస్టులు. జైలుకు పోవడం అంటే గప్పట్లో భయం కాదు.. అదొక త్యాగానికి గుర్తు.. రాకేష్ కూడా ఎన్నోసార్లు ఇనుప కటకటాల వెనక్కి పోయి గూసొచ్చినా, బయటికొచ్చి మళ్లీ రెట్టింపు ఉత్సాహంతో జెండా పట్టిండు.

### నాడు ఉద్యమ కెరటం.. నేడు అసిస్టెంట్ ప్రొఫెసర్!

2014 జూన్ 2న కలల తెలంగాణ సాకారమైంది. రాష్ట్రం వచ్చినాక కూడా రాకేష్ తన చదువును నిర్లక్ష్యం చేయలేదు. కష్టపడి చదివిండు.. ఎంఏ, ఎంసీజె, ఎంఏ పీహెచ్‌డీ పూర్తి చేసి ఉస్మానియా యూనివర్సీటీ నుంచి 'డాక్టర్' పట్టా అందుకున్నాడు. నాడు క్లాస్ రూమ్ వదిలి రోడ్లెక్కి కొట్లాడిన ఈ విద్యార్థి లీడర్, ఈరోజు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మారి వందల మంది విద్యార్థుల భవిష్యత్తును ఇస్తున్నడు.ఒక సాధారణ పాన్ షాప్ నడిపే తండ్రి కొడుకు, జైలు గోడలను చూసి, పోలీస్ లాఠీ దెబ్బలను భరించి, ఈరోజు గౌరవప్రదమైన ప్రొఫెసర్ ఉద్యోగం చేస్తున్నాడంటే.. అది ఆయన పట్టుదలకు, అంకితభావానికి నిదర్శనం. తెలంగాణ ఉద్యమం ఒక సామాన్యమైన పోరాటిని ఎట్లాంటి లీడర్‌గా, బాధ్యతగల పౌరుడిగా మలిచిందో చెప్పడానికి డా. కొండేరు రాకేష్ జీవితమే ఒక పెద్ద ఉదాహరణ! తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ.. రాకేష్ లాంటి ఎందరో వీరుల త్యాగాలను, పోరాటాలను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువదు. జై తెలంగాణ.!.. జైజై తెలంగాణ..!!


తెలంగాణ రాక పోతే మా బతుకులింతే అంటూ రోడ్ల ఊడ్చుతున్న కొండేరు రాకేష్


ధర్నా చేస్తున్న రాకేష్‌ను బెదిరిస్తు అరెస్ట్ చేస్తున్న పోలీసులు



రామంతాపూర్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న కొండేరు రాకేష్



భూపాలపల్లి టు హైదరాబాద్ ఓయూ వరకు మహా పాదయాత్ర చేస్తోన్న రాకేష్












# ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్ల దెబ్బ..
# భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



**ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, జూన్ 1:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ రోజు సోమవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంకింగ్, ఆటో, రియల్టీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు కుదేలయ్యాయి. మరోవైపు, అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరమైన పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తున్నారు.ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 508.40 పాయింట్లు నష్టపోయి 74,267.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 165.15 పాయింట్ల పతనంతో 23,382.60 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.45 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ 0.88 శాతం నష్టపోయింది.నిఫ్టీలో హిందుస్థాన్ యూనిలీవర్, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, ఐటీసీ, ఎన్టీపీసీ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ 2.83 శాతం వరకు నష్టపోయాయి.

# ఉప్పల్ భగాయత్‌ల 'వంజరి భవనం' ఓపెనింగ్‌కు సర్వం సిద్ధం!

- ఈ నెల 7న పొద్దుగాల 10 గంటల 11 నిమిషాలకు ముహూర్తం
- తొమ్మిది కోట్లతో అద్దాల మేడ తీరుగా ముస్తాబైన కల్యాణ మండపం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మాజీ కార్యవర్గం..
- మధ్యాహ్నం మహిళా సదస్సు, లీడర్లకు సన్మానం
- మన వంజరి ఆత్మగౌరవ ప్రతీక.. రాష్ట్రవ్యాప్తంగా కుల బంధువులు కదిలిరావాలని పిలుపు

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, మే 1:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వంజరి కులబాంధవుల ఏండ్ల నాటి కల, ఆత్మగౌరవ కల నెరవేరబోతోంది. తెలంగాణ వంజరి సంఘం ఎంతో ఇజ్జత్‌తో తలపెట్టిన కుల సంఘం ఆత్మగౌరవ భవన సముదాయం, కల్యాణ మండప ఓపెనింగ్‌కు టైం ఫిక్స్ అయింది. హైదరాబాద్ సిటీలనే ఎంతో కిరికిరి లేని పైలం ఉన్న ఉప్పల్ భగాయత్ ఏరియాల అప్పటి బీఆర్ఎస్ సర్కార్ ఇచ్చిన ఒక్క ఎకరం జాగల, దాదాపు 9 కోట్ల రూపాయల భారీ ఖర్చుతో ఎక్కడా తగ్గేదేలే అన్నట్టుగ గీ అద్భుత భవనాన్ని కట్టింది. గీ చరిత్రాత్మక కట్టడాన్ని ఈ నెల 7వ తేదీ ఆదివారం పొద్దుగాల 10 గంటల 11 నిమిషాల గడియకు ఘనంగా ప్రారంభించబోతున్నారు.

## పండుగలాగ ఓపెనింగ్ చేసుకుందాం



ఈ నెల 7న పొద్దుగాల 10:11 గంటలకు.. బాపనోళ్ల వేదమంత్రాల సాక్షిగా భవన్, కల్యాణ మండపం పండుగల ఓపెనింగ్ చేసుకుందాం. మధ్యాహ్నం ఆడబిడ్డల కోసం ప్రత్యేకంగా 'మహిళా సదస్సు'తో పాటు ఓపెనింగ్ కు వచ్చిన పెద్దలకు సన్మానం చేస్తున్నం ... తెలంగాణలోని ప్రతి జిల్లా, ప్రతి పల్లె నుండి వంజరి కుల పెద్దలు, మా ఆడపడుచులు, యువత అందరూ గుంపులుగా తరలిరావాలి.. మన ఆత్మగౌరవ పండుగను విజయవంతం చేయాలె...

**- కాలేరు నరేందర్, మాజీ అధ్యక్షుడు,**
**తెలంగాణ వంజరి సంఘం**




ఉప్పల్ భగాయత్ లో సర్వాంగ సుందరంగా ముస్తాబైన వంజరి కల్యాణ మండపం

### అందరికంటే ముందే.. సురుకుగ, జల్దీగ!

ఉప్పల్ భగాయత్ జాగల వెనుకబడిన 33 కులాలకు అప్పటి సర్కార్ జాగా ఇస్తే.. అందుల అందరికంటే ముందే, ఎంతో జల్దీగ వంజరి కులపోళ్లు తమ ఆత్మగౌరవ భవనాన్ని లేపి రికార్డు కొట్టిన్రు. వంజరి కులపోళ్ల తిండి, తిప్పలు, కష్టాలను సూసి, అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు దృష్టికి తీసుకెళ్లి ఒక ఏకరం జాగ ఇప్పించడంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గట్టిగ నిలబడి ముందడుగు వేసిండు. గీ సందర్భంగా కేసీఆర్‌కు, బీసీ వెల్ఫేర్ శాఖకు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు వంజరి సమాజం ఎప్పటికీ రుణపడి ఉంటదని సంఘం పెద్దలు చెప్పుకొచ్చారు.

### పంతం నెగ్గించుకున్న మాజీ కార్యవర్గం..

సంఘం మాజీ అధ్యక్షుడు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, క్యాషియర్ కాలేరు అమరేందర్‌తో పాటు కార్యవర్గ దోస్తులు.. తమ పదవీకాలం అయిపోయినా సరే, కులానికి ఇచ్చిన మాట తప్పొద్దని కంకణం కట్టుకున్నారు. రాత్రింబవళ్లు ఒక్కటి చేసి శ్రమించిన్రు. వంజరి కులపోళ్లకు ఒక సొంత కల్యాణమండపం ఉండానే ఇన్నేండ్ల కలను, సంఘం పైసలతోని, కులపోళ్ల సాయంతో సక్సెస్‌ఫుల్‌గ పూర్తి చేసి చూపెట్టిన్రు.



# రూ.వెయ్యి కోట్ల నిధులపై సీఎం ఫోకస్..

## అధికారులకు సీరియస్ వార్నింగ్.!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 1:** వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నైరుతి రుతుపవనాల ప్రభావం, ఈ ఏడాది వర్షపాతం పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు.సమీక్ష సందర్భంగా రైతులకు వర్షాభావ పరిస్థితులపై ముందస్తు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అలాగే పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల పనులపై కూడా సీఎం ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రాజెక్టుల గేట్లు, ఇతర నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు.విపత్తు నిర్వహణ శాఖ వద్ద అందుబాటులో ఉన్న రూ.1000 కోట్ల నిధులను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా వినియోగించాలని సీఎం స్పష్టం చేశారు.



# పశ్చిమాసియాలో శాంతికి 'భారత్' ఒక్కటే మార్గం: ఇజ్రాయెల్

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 1:** భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి భారతదేశం అత్యంత కీలకమైన పాత్ర పోషించాల్సి ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా, బలమైన వాణిజ్య భాగస్వామిగా భారత్ ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రపంచంలోని అన్ని ప్రధాన వాణిజ్య కూటములతో భారత్ చారిత్రాత్మక ఒప్పందాలను కుదుర్చుకుందని రూవెన్ అజర్ గుర్తుచేశారు. "పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పి, తీవ్రవాద శక్తులను అణచివేయగలిగితే.. భారత్ ద్వారా వచ్చే ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు, వస్తు రవాణా వల్ల ఇక్కడి దేశాలన్నీ అద్భుతమైన సంపదను, శ్రేయస్సును అనుభవిస్తాయి. అందుకే ఈ ప్రాంత స్థిరత్వంలో ఢిల్లీ పాత్ర ఎంతో కీలకం" అని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన దౌత్య బంధాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై విమర్శలు వస్తున్నప్పటికీ.. భారత్ నుంచి మాత్రం తమకు అచంచలమైన ప్రజా మద్దతు లభిస్తోందని చెప్పారు. "భారత్‌లో ఇజ్రాయెల్ పట్ల ఒక అద్భుతమైన క్రేజీ లవ్ ఉంది. ప్రపంచంలో మరే దేశం నుంచి లేనంత మంది ఫాలోవర్లు నాకు ఒక్క భారతదేశం నుంచే ఉన్నారు"అని నెతన్యాహు సంతోషం వ్యక్తం చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు

## సిట్ విచారణకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 1:** గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా.. సిట్ ఆయనతో పాటు మరో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిని విచారణకు రావాలని 160



సీఆర్పీసీ కింద నోటీసులు జారీ చేసింది. దీంతో బంజారాహిల్స్ లోని ఐసీసీసీ కార్యాలయంలో విచారణకు ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత తమ ఫోన్లు ట్యాప్ అయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే సిట్ అనేక మందిని ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారించిన సిట్.. ఎన్నికల సమయంలో వీరిద్దరి ఫోన్లు ట్యాప్ అయినట్లు గుర్తించింది. ఫోన్ ట్యాపింగ్ పై ఫిర్యాదు చేసినవారిలో వీరిద్దరూ ముందువరుసలో ఉండగా.. ఏ ఆధారాలతో ఈ ఆరోపణలు చేశారన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలోనూ ఒకసారి విచారణకు రావాలని నోటీసులివ్వగా.. అనివార్యకారణాలతో హాజరు కాలేకపోయినట్లు తెలిపారు. దీంతో మరోసారి నోటీసులు ఇచ్చి.. సిట్ అధికారులు ఇద్దరు ఎమ్మెల్యేలను విచారిస్తున్నారు.

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై... మంత్రి పొన్నం ఫైర్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 1:**
"తెలంగాణ ప్రజల చూపు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయంటూ గతంలో ఇక్కడి సమాజం పై విషం కక్కిన వ్యక్తి పవన్ కల్యాణ్. రాష్ట్రం వస్తే 11 రోజులు అన్నం తిననని ఏడ్చిన ఈ



తెలంగాణ ద్వేషి.. ఇవాళ ఇక్కడికి వచ్చి నవ నిర్మాణ సభలు పెడతానంటే తెలంగాణ రక్తం ఉన్న ఏ బిడ్డ ఒప్పుకోడు. పవన్ కల్యాణ్ వెంటనే తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. ఆ తర్వాతే ఇక్కడ సభల గురించి ఆలోచించాలి" అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

సోమవారం హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై నిప్పులు చెరిగారు. గతంలో తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన పవన్.. ఇప్పుడు పూర్తిగా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.



# నిరుద్యోగులకు భారీ శుభవార్త..

## రేపు మూడు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్న టీజీపీఎస్సీ చైర్మన్..

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 1:** తెలంగాణలోని నిరుద్యోగ నిరుద్యోగులకు (తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్) చైర్మన్ బుర్ర వెంకటేశం ఒక పెద్ద శుభవార్త చెప్పారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో వేగం పెంచడంతో పాటు, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సరికొత్త మార్పులు తీసుకు వస్తున్నట్లు ఆయన ప్రకటించారు. మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, నిరుద్యోగుల్లో నమ్మకం కలిగించేలా పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు.ప్రభుత్వం నుంచి ప్రస్తుతం 3,800 ఉద్యోగ పోస్టుల భర్తీకి అనుమతులు వచ్చాయని చైర్మన్ తెలిపారు. అటవీ శాఖలో 3,093 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. సింగిల్ పోస్ట్ ఖాళీలు 25 ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీ కోసం ఇకపై క్రమంతప్పకుండా రెగ్యులర్ గా నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెల సగటున మూడు నోటిఫికేషన్లు ఇస్తామని, రేపే మూడు కొత్త నోటిఫికేషన్లను విడుదల చేస్తున్నామని ఆయన ప్రకటించారు.

# రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు గుడ్‌న్యూస్..

## నూతన ఒరవడికి కాంగ్రెస్ శ్రీకారం

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 1:** రాజకీయాల్లోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతకు కాంగ్రెస్ పార్టీ సువర్ణావకాశం కల్పిస్తోందని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల నుంచి పుట్టిన 'టాలెంట్ హంట్' వినూత్న కార్యక్రమం వివరాలను వెల్లడించారు. పార్టీ అధికార ప్రతినిధుల నియామకంలో



సరికొత్త పద్ధతికి శ్రీకారం చుట్టామని ఆయన స్పష్టం చేశారు. "దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకం కావాలని రాహుల్ గాంధీ గారు సంకల్పించారు. అందుకోసమే పార్టీలకు అతీతంగా, కేవలం ప్రతిభ, సమాజ సేవ చేయాలనే దృక్పథం ఉన్న యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించడానికి ఈ టాలెంట్ హంట్ నిర్వహిస్తున్నాం." అని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడిం చారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా అధికార ప్రతినిధులను ఎలా ఎంపిక చేస్తారో మహేష్ కుమార్ గౌడ్ వివరించారు. జాతీయ రాజకీయాలు, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న వారితో పాటు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమైన 'లౌకికవాదం' పై గట్టి పట్టున్న వ్యక్తులను గుర్తించి ఈ అవకాశం కల్పిస్తామన్నారు. సమాజ సేవ చేయాలనే బలమైన కోరిక ఉండి, రాజకీయాల్లో రాణించాలనుకునే మంచి వ్యక్తులకు ఇదొక గొప్ప వేదిక కానుందని పేర్కొన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా కేవలం టాలెంట్, సమాజ సేవ చేసే దృక్పథం ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని వెల్లడించారు.

# ఎందుకు ఈ నిర్లక్ష్యం?

## రేవంత్ ప్రభుత్వానికి రాంచందర్ రావు ప్రశ్న

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 1:** తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో కొనుగోళ్లు సాగుతున్న తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు."చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని నాడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మరి ఇప్పుడెందుకు ఈ నిర్లక్ష్యం?" అని రాంచందర్ రావు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా



రోడ్లపైనే ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందని, దిగుబడికి సంబంధించిన సరైన గణాంకాలను కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రాలు సేకరించిన ధాన్యానికి మాత్రమే కేంద్రం నిధులు రీయింబర్స్ చేస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం వల్లే రైతులకు ఈ దుస్థితి దాపురించిందని గుర్తుచేశారు.

# నీట్ రీ-టెస్ట్‌పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు..

## సీబీటీ పిటిషన్ తిరస్కరణ

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 1:** నీట్ (యూజీ) 2026 రీ-టెస్టును కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. దీంతో, ముందుగా నిర్ణయించిన ప్రకారం జూన్ 21న ఓఎంఆర్ విధానంలోనే ఈ పరీక్ష జరగనుంది. ఈ మేరకు ఆర్జేడీ ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అరవింద్ కుమార్ లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ దశలో పరీక్షా విధానాన్ని మార్చడం వల్ల తీవ్రమైన నిర్వహణాపరమైన సవాళ్లు ఎదురవుతాయని కోర్టు



అభిప్రాయపడింది. సమయాభావం, ఎన్టీఏపై ఉన్న ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

"ఇలాంటి అభ్యర్థనలను గతంలోనే తిరస్కరించాం. ఈ అంశాన్ని వెకేషన్ తర్వాత జులైలో విచారిస్తాం" అని జస్టిస్ నరసింహ స్పష్టం చేశారు.మే 3న జరిగిన నీట్ (యూజీ) 2026 పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో దాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. వాట్సాప్‌లో సర్క్యులేట్ అయిన 'గెస్ పేపర్'లోని సుమారు 120 ప్రశ్నలు అసలు ప్రశ్నపత్రంతో సరిపోలడంతో ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరుగుతోంది. 22 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షను మళ్లీ నిర్వహించాలని నిర్ణయించారు.




# పశ్చిమ బెంగాల్‌లో మంత్రివర్గ విస్తరణ..

## నబన్నాలో 35 మంది మంత్రుల ప్రమాణ స్వీకారం

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 1:**
పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రభుత్వంలో సోమవారం భారీ మంత్రివర్గ విస్తరణ జరిగింది. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన దాదాపు మూడు వారాల తర్వాత నిర్వహించిన ఈ తొలి విస్తరణలో మొత్తం 35 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ రవి నబన్నాలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్త మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో దీపక్ బర్మన్, తపస్ రాయ్, డాక్టర్ శంకర్ ఘోష్, గార్గీ దాస్ ఘోష్, స్వపన్ దాస్‌గుప్తా, అజయ్ కుమార్ పోద్దార్ వంటి ప్రముఖ నాయకులు ఉన్నారు. అలాగే మాజీ క్రికెటర్ అశోక్ దిండా, పూర్ణిమా చక్రవర్తి, డాక్టర్ ఇంద్రనిల్ ఖాన్, మాలతి రావా రాయ్ తదితరులు కూడా మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు.

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL


https://epaper.eyyaltynews.in/

జనరల్ న్యూస్ | చూసి మురవ్వాలే | సోమవారం, జూన్ 1, 2026




## కడుపుతో ఉన్న భార్య కోసం ఖాకీలతోని కొట్లాట.. నడిరోడ్డుపై కూర్చున్న సామాన్యుడు!..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 1: వీఐపీ భద్రత పేరుతో సామాన్య ప్రజలకు కలుగుతున్న అసౌకర్యం, ఇబ్బందులపై కర్ణాటక రాజధాని బెంగళూరులో మరోసారి ప్రజాగ్రహం పెల్లుబిక్కింది. గవర్నర్ కాన్వాయ్ వెళ్లేందుకు వీలుగా పోలీసులు పాత విమానాశ్రయం (ఓల్డ్ ఎయిర్‌పోర్ట్) రోడ్డుపై సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడంతో భారీ గందరగోళం చెలరేగింది. ఈ ఊపిరాడని ట్రాఫిక్ జామ్‌లో అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్తున్న ఓ గర్భిణీ స్త్రీ, ఆమె భర్త చిక్కుకుపోయారు. పోలీసుల తీరుతో సహనం కోల్పోయిన ఆమె భర్త.. నిరసనగా నడిరోడ్డుపైనే బైఠాయించి ధర్నాకు దిగాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. పాత విమానాశ్రయ రహదారిలో ప్రస్తుతం అండర్‌పాస్ నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఈ రోడ్డు ఇప్పటికే ఇరుకుగా మారి, వాహనదారులు రోజూ నరకం చూస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం గవర్నర్ కాన్వాయ్ ఆ దారి గుండా వెళ్తుండటంతో సమస్య మరింత జటిలమైంది. మధ్యాహ్నం సుమారు 12:13 గంటల ప్రాంతంలో ఓ ఖాతా నుంచి ఎక్స్ వేదికగా ఓ వీడియో పోస్ట్ అయింది. "ఈరోజు, గవర్నర్ గారి రాకపోకల కారణంగా, సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది" అంటూ సదరు నెటిజన్ ఆ వీడియోను పంచుకున్నారు.





## లేటెస్ట్ షూట్‌లో సోనాల్ చౌహాన్ అందాల విందు..


### పోరగాళ్లకు పిచ్చెక్కించే లుక్స్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 1: అందాల ముద్దుగుమ్మ సోనాల్ చౌహాన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తెలుగులో ముఖ్యంగా బాలకృష్ణ సినిమాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈ బ్యూటీ, చివరగా 'ఎఫ్3' సినిమాలో కనిపించి ప్రేక్షకులను అలరించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. సినిమాల్లో తన గ్లామర్‌తో ఆకట్టుకునే సోనాల్ చౌహాన్, అప్పుడప్పుడు సోషల్ మీడియా వేదికగా కూడా తన హాట్ అండ్ స్టైలిష్ ఫోటోలతో అభిమానులను అలరిస్తూ ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీకి సంబంధించిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఫోటోల్లో సోనాల్ అల్ట్రా స్టైలిష్ డ్రెస్‌లో సోఫాపై కూర్చొని, తన గ్లామరస్ లుక్‌తో కెమెరాకు స్టన్నింగ్ పోజులు ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## అబ్బబ్బా అనిపిస్తున్న నాభా నటేష్ అందాలు..

### క్రేజీ ఫోటోలు వైరల్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 1: టాలీవుడ్ 'ఇస్మార్ట్ బ్యూటీ'నభా నటేష్ సరికొత్త స్టైలిష్ అండ్ గ్లామరస్ లుక్‌తో కుర్రాళ్ల గుండెల్లో మంటలు రేపుతోంది. ట్రెండీ అవుట్‌ఫిట్‌లో తన నాజూకు నడుము, హాట్ అందాలను ఆరబోస్తూ ఆమె ఇచ్చిన క్రేజీ పోజులు ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ నయా ఫోటోషూట్‌పై నెటిజన్లు లైకులు, ఫైర్ ఎమోజీలతో కామెంట్ల వర్షం కురిపిస్తూ నెట్టింట తెగ వైరల్ చేస్తున్నారు.





## రవితేజతో ప్రత్యేక బంధం ఉంది..

### మాస్ మహారాజా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన రీమా సేన్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 1: రవితేజ తన బెస్ట్ ఫ్రెండ్స్‌లో ఒకరని, ఆయనతో తనకు ప్రత్యేక స్నేహబంధం ఉందని రీమా సేన్ చెప్పుకొచ్చారు.కేవలం సినిమాల్లోనే కాకుండా, తన వ్యక్తిగత విషయాల్లో కూడా రవితేజ ఎన్నో సహాయాలు అందించారని తెలిపింది. ఆయన ఎంతో సరదాగా ఉంటారని, షూటింగ్ సెట్‌లో ఉంటే చాలు అందరూ నవ్వుతూ ఆనందంగా ఉంటారని చెప్పింది. కష్టాల్లో తోడు నిలిచినందుకు రవితేజపై తనకు ఎప్పుడూ ప్రత్యేకమైన గౌరవం ఉంటుందని రీమా సేన్ వివరించింది.

## ఎద అందాలు చూపిస్తూ..


### మతిపోయే గ్లామర్‌తో మృణాల్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 1: నటి మృణాల్ ఠాకూర్ సరికొత్త బోల్డ్ లుక్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. తన మతిపోయే ఎద అందాలను ఆరబోస్తూ ఆమె పంచుకున్న గ్లామరస్ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. సాంప్రదాయ పాత్రల్లోనే కాకుండా, మోడ్రన్ అండ్ హాట్ లుక్స్‌లోనూ తాను అదరగొట్టగలనని మృణాల్ ఈ క్రేజీ ఫోటోషూట్‌తో మరోసారి నిరూపించారు.



## స్పిరిట్ కోసం మైత్రి థియేటర్.. అలాంటి సీన్ ఉండనుందా?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 1: రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న స్పిరిట్ చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమా ప్రారంభమైన తర్వాత విడుదలైన ఒక్క పోస్టర్‌తోనే సినిమాపై అంచనాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఆ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని కలిగించింది. ఈ చిత్రంలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. తాజాగా ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈరోజు హైదరాబాద్‌లోని మైత్రి విమల్ థియేటర్‌లో ఈ సినిమా షూటింగ్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా థియేటర్లలో షూటింగ్ అంటే మరో సినిమా ప్రదర్శన జరుగుతున్న సమయంలో హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలు లేదా యాక్షన్ సీన్లు చిత్రీకరిస్తుంటారు. దీంతో స్పిరిట్ చిత్రంలో కూడా అలాంటి కీలక సన్నివేశం ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడిగా త్రిప్తి దిమ్రి నటించనుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాష్ రాజ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టీ-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.






### 'పెద్ది'వరల్డ్‌వైడ్ ప్రీ రిలీజ్ బిజినెస్ వివరాలివే..

## మామూలు టార్గెట్ కాదు

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 1: మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా రూపొందిన పెద్ది సినిమాను జూన్ 4న విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన అన్ని ఏరియాల థియేటర్ హక్కులను ఇప్పటికే అమ్మివేశారు. ఈ సినిమాకు ప్రపంచవ్యాప్తంగా ఏ ఏరియాలో ఏ రేంజ్‌లో ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగింది? మొత్తంగా ఎన్ని కోట్ల టార్గెట్‌తో ఈ సినిమా బాక్సాఫీస్ బరిలోకి దిగబోతోంది? అనే వివరాలను తెలుసుకుందాం.నైజాం - రూ.48 కోట్లు,సీడెడ్ - రూ.24 కోట్లు,ఉత్తరాంధ్ర - రూ.18 కోట్లు,ఈస్ట్ - రూ.10.20 కోట్లు,వెస్ట్ - రూ.8.25 కోట్లు,గుంటూరు - రూ.11.20 కోట్లు,కృష్ణా - రూ.9.30 కోట్లు , నెల్లూరు - రూ.6.30 కోట్లు మొత్తంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి - రూ.135.25 కోట్లు కాగా..కర్ణాటక -రూ.17 కోట్లు,తమిళనాడు - రూ.5.25 కోట్లు, కేరళ - రూ.2 కోట్లు, హిందీ మరియు రెస్ట్ ఆఫ్ ఇండియా- రూ.25 కోట్లు, ఓవర్సీస్ - రూ.34 కోట్లు ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాకు రూ.218.50 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగినట్లు సమాచారం. దాదాపు రూ.220 కోట్ల టార్గెట్‌తో ఈ మూవీ బాక్సాఫీస్ బరిలోకి దిగబోతోంది.

### బ్యాంక్ ముందే వంటలు.. అక్కడే భోజనాలు..

## అసలు మ్యాటరేంటంటే?

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 1:

రోడ్డుపై గుమగుమలాడే వంటలు.. పంక్తులు తీరి కూర్చున్న జనం.. దారిన పోయే వారందరిని ఆప్యాయంగా పిలిచి వడ్డిస్తున్న వైనం. ఇదంతా చూస్తే ఇదేదో దసరా నవరాత్రి ఉత్సవాలో, గణేష్ నవరాత్రుల్లో పెట్టే అన్నదానాలో, లేక ఊరిలో జరిగిన పెద్ద పెళ్లి భోజనాలో అనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఇది ఏ పండుగో, శుభకార్యమో కాదు.. తమ న్యాయమైన హక్కుల కోసం చెన్నూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఎదుట 'బంగారు రుణాల బాధితులు' చేపట్టిన వినూత్న నిరసన. తీరని అన్యాయంతో రోడ్డెక్కిన బాధితులు ఈ తీరున నిరసన చేపట్టారు.వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా చెన్నూరు SBI బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి మోసపోయామంటూ గత కొంతకాలంగా ఆందోళన చెందుతున్న బాధితులు.. తాజాగా సోమవారం నిరసనను ఉధృతం చేశారు. బ్యాంకు అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన బాధితులంతా ఏకమై 'బ్యాంకు ముందే వంటావార్పు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

బ్యాంకు లోపల, బయట వంటలు వండుకుని అక్కడే కూర్చుని తింటూ తమ నిరసనను వ్యక్తం చేశారు. మా కష్టార్జితాన్ని బ్యాంకులో పెడితే మాకు దిక్కు లేకుండా పోయింది. అధికారులు స్పందించే వరకు మా పోరాటం ఆగదు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ వంటవార్పు చేపట్టారు.

అన్నం వడ్డిస్తూనే.. ఎస్బీఐ బ్యాంకులో తమకు జరిగిన అన్యాయాన్ని, పడుతున్న ఇబ్బందులను దారినపోయే వారికి వివరించి తమ గోడును వెళ్లబోసుకున్నారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సాగిన ఈ వినూత్న ఆందోళన ప్రస్తుతం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది.






## పగలు డెలివరీ బాయ్‌గా.. రాత్రయితే అంతా కచ్రా యవ్వారం.!

ఇయ్యాల్టి న్యూస్, క్రైం, జూన్ 1:

పగటిపూట ఆన్‌లైన్ వస్తువులను డెలివరీ చేస్తూ, తాళాలు వేసి ఉన్న ఇళ్లను రెక్కీ చేసి రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఒక డెలివరీ బాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఏపీ విజయనగరం జిల్లా, రొంపల్లి గ్రామానికి చెందిన పువ్వల మణికంఠ . ఈయన బొబ్బిలి, బాడంగి, సీతానగరం పరిసర ప్రాంతాలు 2023 నుండి వరుస చోరీలకు విహారయాత్ర చేస్తున్నాడు.మణికంఠ దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేస్తున్న సాలూరుకు చెందిన బంగారు వ్యాపారి బాలేశ్వరరావును కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.నిందితుల నుంచి సుమారు 20 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన డబ్బును మణికంఠ జల్సాలకు, చెడు వ్యసనాలకు ఖర్చు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## చెట్టుపై నుండి నోట్ల వర్షం.. దొరికినోనికి దొరికినంత..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 1: కోతులు చేసే కొన్ని పనులు గమ్మత్తుగా ఉంటాయి. ముఖ్యంగా ఏదైనా వస్తువు కనిపించిందంటే చాలు అక్కడ నుండి ఎత్తుకు పోతుంటాయి. అందులో ఆహారపదార్థాలు ఉంటాయనుకుంటాయో ఓమో కానీ, కనిపించిన ప్రతిదాన్ని ఎత్తుకు పోతుంటాయి. చివరికి అందులో ఎలాంటి ఆహారం లేకపోతే గాలిలోకి విసిరేస్తాయి. తాజాగా అలాంటి ఘటనే యూపీలో చోటు చేసుకుంది. కానీ ఇక్కడ కోతి ఏకంగా నోట్ల కట్టలను ఎత్తుకెళ్లింది. యూపీలోని బులందర్ లో ఒక కోతి చెట్టుపై కూర్చుని ఏకంగా రూ.2 లక్షల నోట్లను కిందకు విసిరేసింది. దీంతో జనాలు ఎగబడి వాటిని తీసుకున్నారు. చెట్టుపై నుండి డబ్బులు కింద పడుతుంటే క్షణం ఆగకుండా తీసేసుకున్నారు. ఆ డబ్బును కోతి ఓ న్యాయవాది వద్ద దొంగలించి అలా పంచిపెట్టింది. ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఓ న్యాయవాది తన బ్యాగులో డబ్బులు తీసుకుని రాగా అతడి వద్ద నుండి కోతి లాక్కుంది. అనంతరం అతడికి దొరక్కుండా బ్యాగుతో చెట్టు ఎక్కేసింది. అనంతరం డబ్బును చెట్టుపై కూర్చుని కిందకి విసిరేసింది. డబ్బంతా విసిరేసి ఆ బ్యాగు కూడా అక్కడే వదిలేసి పారిపోయింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.



## ముగ్గురు బిడ్డలకు దగ్గు మందని, విషమిచ్చి... తల్లి ఆత్మహత్య!

ఇయ్యాల్టి న్యూస్, క్రైం, జూన్ 1: మధ్యప్రదేశ్‌లోని షాహ్‌దోల్ జిల్లా, హిర్వా గ్రామంలో ఒక తల్లి తన ముగ్గురు కుమార్తెలకు దగ్గు మందని చెప్పి పురుగుల మందు ఇచ్చి, ఆ తర్వాత తను కూడా తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో నలుగురూ ప్రాణాలు కోల్పోయారు.అనితా సింగ్ (32), ఆమె కుమార్తెలు రితిక (7), కృష్ణకుమారి (4), అర్పిత (2). ఆమె భర్త ట్రక్ డ్రైవర్‌గా పనిచేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అనిత తీవ్ర మానసిక ఒత్తిడిలో కనిపిస్తోంది. విషం తాగడానికి ముందు ఆమె ఇంట్లోని బట్టలు, పత్రాలు, ఫోటోలు, ధాన్యానికి నిప్పంటించింది.పెద్ద కుమార్తె రితిక (7) విషం తిన్న తర్వాత ఇరుగుపొరుగు వారిని పిలిచి విషయం చెప్పింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించే ముందు ఆమె పోలీసులకు ఇచ్చిన సమాచారం ఈ కేసులో కీలక ఆధారంగా మారింది.భర్త డబ్బులు పంపిస్తున్నప్పటికీ, ఆర్థిక పరిస్థితి అంత బలంగా లేదు. అయితే ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




ON BEHALFOF RRR MEDIA PRIVATE LIMITED. 2-3-603/49A, PATELNAGAR, AMBERPET, HYDERABAD.TELNGANA 500013..

EDITOR:RAMAN RAJU RATHNA.RNI NO:TG/2024/1093, Email:ramannews9@gmail.com Phone:9949152838,7013794396